ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 2 మార్చి 2025

నేడు జాబ్‌మేళా

ఆమనగల్లు, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మహిళా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమనగల్లు ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు. ఎంపికైన మహిళలకు తుక్కుగూడ సమీపంలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని ఆయన చెప్పారు. వేతనంతో పాటు బస్సు సౌకర్యం, ఉచిత భోజన వసతి, బీమా, పీఎఫ్ సౌకర్యాలు ఉంటాయని పేర్కొన్నారు. 18 నుంచి 33 ఏళ్ల వయసు, టెన్త్ ఆపై చదువుకున్న వారు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్వకుర్తి నియోజకవర్గ మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని రాఘవేందర్ రెడ్డి కోరారు.



యాచారం పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

ఇంటర్ ప్రశ్నపత్రాలు
వచ్చేశాయ్

ఆమనగల్లు/యాచారం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు శనివారం ఆమనగల్లు, యాచారం పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ నెల 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. యాచారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 330 మంది విద్యార్థులు పరీక్షల రాయనున్నారు.





రూ. 880 కోట్లు

డీసీసీబీలో పేరుకుపోయిన బకాయిలు

- 57 సొసైటీల్లో నిలిచిన రుణాల రికవరీ
- వసూళ్లపై అధికారుల దృష్టి
- బకాయిదారులకు నోటీసులు
- అవసరమైతే చట్టపరమైన చర్యలు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో రుణాల రికవరీ నిలిచిపోయింది. కొండలా పేరుకుపోయిన బకాయిల వసూళ్లపై జిల్లా సహకార బ్యాంకు అధికారులు దృష్టి సారించారు. ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం ఆసన్నమవుతున్న నేపథ్యంలో బకాయిల వసూళ్లకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. వాయిదా మీరి బకాయి కలిగిన వారికి నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తున్నారు. కొందరు స్పందించి పెండింగ్ రుణాలను చెల్లిస్తున్నారు. మిగతావారిపై అధికారులు చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు.

రంగారెడ్డి అర్బన్/ యాచారం, మార్చి 1 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో అడ్డగోలుగా ఇచ్చిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాల రికవరీకి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఈ నెలాఖరు వరకు రుణాలను రికవరీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించడంతో సిబ్బంది దూకుడుగా వ్యవహరిస్తుంది. ఇప్పుడు లేవు.. రేపు రండి.. వారం తర్వాత కడతామని రుణాలు తీసుకున్న లబ్ధిదారులు రేపు మాపు అంటూ సిబ్బందిని తిప్పించుకుంటున్నారు. పాత బకాయిలు వసూలు కావడం లేదు. కొందరు నిబంధనలను అతిక్రమించి వ్యవహరించడం వివాదాస్పదంగా మారుతుంది. డీసీసీబీ పరిధిలో 57 సొసైటీలలో 3,600 మంది రైతుల నుంచి

మిగతా 7వ పేజీలో...



సంగెంలో నిరుపయోగంగా వాటర్ ట్యాంకు

భగీరథా.. ఏమిటీ వ్యథ!

- అలంకారప్రాయంగా మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులు
- బైర్కాన్‌పల్లిలో ట్యాంకులోకి ఎక్కని నీరు
- సంగెంలో బీసీ కాలనీకి ఆరు నెలలుగా అందని తాగునీరు
- వేసవి సమీపిస్తుండడంతో ఆందోళనలో ప్రజలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 1(ఆంధ్ర జ్యోతి): మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి తాగునీరు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడంలేదు. సాంకేతిక సమస్యతో ఓ గ్రామంలోని వాటర్ ట్యాంకులోకి నీరు ఎక్కడం లేదు. మరో గ్రామంలో ట్యాంకు స్లాబ్ కూలిపోతే కనీసం మరమ్మతు చేయించడం లేదు. ఇలా అనేక గ్రామాల్లో వాటర్ ట్యాంకులు అలంకారప్రాయంగా మారాయి.

పరిస్థితి ఇలా ఉంది..

కేశంపేట మండలం సంగెం, బైర్కాన్‌పల్లి గ్రామాలలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల పరిస్థితి అధ్వానంగా మారింది. సంగెం గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు పైకప్పు కూలిపోయింది. దీంతో మిషన్ భగీరథ నీటిని ట్యాంకులోకి ఎక్కించకుండా వాల్వ్ తొలిగించారు. మిషన్ భగీరథ

మిగతా 8వ పేజీలో...

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
ఆదివారం	సోమవారం
సాయంత్రం 6 : 28	ఉదయం 5 : 11

గోవులంటే ప్రాణం


ఇంట్లోనే ఆవులకు ఆవాసం

Sunday Special

- వాటికి నిత్యం సేవ చేయడంలోనే ఆనందం
- ఒక్కోటి రైతులకు దానం చేయడం ఆయన నైజం
- మాజీ ఎమ్మెల్యే బక్కని పశుపోషణ తీరుపై ప్రత్యేకం

గోవులంటే ఆయనకు ప్రాణం. రోజు కొన్ని గంటల పాటు వాటికి సేవ చేయడమే ఆయనకు ఆనందం. ఇంట్లోనే ఆవులకు ఆవాసాన్ని ఏర్పాటు చేసి వాటి సేవలో తరిస్తున్నాడు. పశు పోషణ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతుందని గట్టిగా నమ్ముతున్న వ్యక్తుల్లో ఆయన ఒకరు. ఎన్ని హోదాలున్నా.. ఏ స్థాయికి ఎదిగినా.. పశు పోషణను వదలకపోవడం గమనార్హం. ఆయన ఎవరో కాదు మాజీ శాసన సభ్యుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు. ఆయన పశు పోషణ విధానంపై ప్రత్యేక కథనం.

7



పాడి ఆవులతో బక్కని నర్సింహులు

ఫార్మా భూసేకరణలో
అక్రమాలు

- కమిషన్ వేసి విచారణ చేయాలి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలో ఫార్మాసిటీ కోసం చేపట్టిన భూసేరణలో అక్రమాలు జరిగాయని, కమిషన్ వేసి విచారణ చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 3వేల ఎకరాల భూములకు సంబంధించిన డబ్బును అక్రమంగా కాజేశారని, బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని కోరారు. శనివారం యాచారం మండల కేంద్రంలో జరిగిన రైతుసంఘ మండల సమావేశానికి ఆ యన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలాంటి పత్రాలు లేనివారికి సైతం భూపరిహారం అందించారని ఆరోపించారు. అక్రమంగా ప్లాట్లు పొందిన వారి నుంచి వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. భూములను నిషేధిత జాబితాలో పెట్టడం వలన చాలామందికి రైతుభరోసా అందడం లేదని విమర్శించారు. ప్రతీ మండలానికి ఒక ఉద్యానవనశాఖ అధికారులను నియమించాలన్నారు. మదర్‌డెయిరీ సంస్థ నెలల తరబడిగా రైతులకు బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు థావ్‌నాయక్, ఎమ్మె ఐల్లయ్య పాల్గొన్నారు.

‘ధరణి’ దరఖాస్తులు
పెండింగ్‌లో ఉంచొద్దు

- ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా రక్షించాలన్నారు. ధరణి సమస్యల కోసం వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను 15వ తేదీలోపు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సర్వేల్యాండ్ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి 15 రోజుల పాటు డ్రైవ్ నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహించి ప్రభుత్వ భూముల హద్దులు గుర్తించి కడీలు, సూచిక బోర్డులు, కంచెలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పోస్టర్ ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 5న జిల్లా కలెక్టరేట్‌లో అలాగే 6,7 తేదీల్లో తేదీల్లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దోమలగూడలోని ప్రభుత్వం కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రౌండ్‌లో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా చైర్‌పర్సన్ రేవతి తెలిపారు. కార్యక్రమంలో గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ నాయకులు రామారావు, సెక్రటరీ శ్రీనివాస్ కుమార్, గంప శ్రీనివాస్, అలివేలు, అనిత, మహేశ్వరి, సుజాత ఉన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 185 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిల్లో 1,47,211 మంది మొదటి, రెండో సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. అలాగే టెన్త్ ఎగ్జామ్స్ కోసం 249 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 51,794 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు ఇంటర్, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు టెన్త్ పరీక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీఐఈవో వెంక్యానాయక్, డీఈవో సుశీందర్‌రావు ఆర్డీవోలు, పోస్టల్, ఆర్టీసీ, పోలీసు, విద్యుత్, మెడికల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రథోత్సవం.. భక్తజన పరవశం

రథాన్ని లాగుతున్న భక్తులు



రంగారెడ్డి అర్బన్, మార్చి 1 : మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వరాలయంలో ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి దోపోత్సవ కార్యక్రమంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రుద్రహోమం, రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మాజీ చైర్మన్‌లు కూన యాదయ్య, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, మునగపాటి నవీన్, కాకి కుమార్, డైరెక్టర్లు రాఖేష్, తిరుపతయ్య, సాయులు, శ్రీశైలం, నరేష్, సువర్ణ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

రంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, డీసీపీలు శ్రీనివాస్, సునీతల ఆధ్వర్యంలో అట్రాసిటీ కేసుల్లో పురోగతి, ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు పని చేయాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, మెరుగైన విద్యను అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీల వసతి గృహాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. సమీక్షలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, జిల్లా శంకర్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రామారావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

చిట్టీల పేరుతో
కుచ్చుటోపీ

- రూ.కోటి మోసం చేసిన ప్రభుత్వ టీచర్, అతని భార్య
- అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

8

ఆలయాల అభివృద్ధికి కృషి

- శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

7

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి

పరిగి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పరిగి తుంకులగడ్డలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. పరిగిలో శనివారం ఆయన మాట్లాడారు. పేదల దరఖాస్తులను పరిశీలించి అర్హులకు అలాట్ చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.10లక్షలివ్వాలని డిమాండ్ చేశారు. మునిసిపల్‌లో విలీనమైన సుల్తాన్‌పూర్, సయ్యద్ మల్కాపూర్, నస్కల్, రుకుంపల్లి, నజీరాబాద్ తండాల్లో ఉపాధి పనులు చేయాలని కోరారు. సమావేశంలో హబీబ్, సత్తయ్య, యాదయ్య, మాంజిల్, రఘురామ్, చెన్నయ్య, బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటయ్య

'సదరం' కోసం యూడీఐడీ పోర్టల్‌లో
రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో దివ్యదేవరాజన్, కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

వికారాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక వైకల్య గుర్తింపు(సదరం) కార్డు కోసం యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో దివ్యదేవరాజన్ తెలిపారు. శనివారం సదరం క్యాంప్‌లు, వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై కలెక్టర్లు, డీఆర్డీవో, డీడబ్ల్యూవో, డీసీహెచ్ఎస్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్లతో సీఈవో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ల కోసం యూడీఐడీ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేలా దివ్యాంగులకు అవగాహ కల్పించాలన్నారు. గతంలో సదరం సర్టిఫికెట్లకు మీసేవ, వీఎల్ఈ కేంద్రాలను ఆశ్రయించేవారని, ఇప్పుడు వీటితో పాటు యూడీఐడీ పోర్టల్, సొంత ఆండ్రాయిడ్ మొబైళ్లతోనూ రిజిస్ట్రేషన్, స్లాట్లు బుక్ చేసుకోవచ్చని ఆమె తెలిపారు. క్యాంపుల వివరాలను మేసేజ్ ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ ప్రక్రియను ఈ మార్చి నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. సదరం కార్డును పోస్టులో దివ్యాంగులకు చేరవేస్తామన్నారు. ఇప్పటికే సదరం ఉన్న వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం అందుతున్న పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఈ విషయమై దివ్యాంగులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో సదరం క్యాంపులను నిర్వహించేందుకు 38 మెడికల్ బోర్డులను గుర్తించడం జరిగిందని తెలిపారు. సదరం క్యాంపుల్లో దివ్యాంగులకు ఇబ్బందులు కలుగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. అంగ వైకల్య గుర్తింపు కార్డు నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకునే విధానంపై మీ సేవ నిర్వాహకులకు శిక్షణివ్వాలని సీఈవో దివ్య సూచించారు. పీఎం కుసుం ప్రాజెక్ట్ కింద గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకునేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్నారు. ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తు స్వీకరించి స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్, సంక్షేమాధికారి ఉమాహారతి, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

షాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కొమరబండలోని శ్రీ బుగ్గరామేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి శనివారం కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌తో కలిసి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రాచీన ప్రసిద్ధ శ్రీ బుగ్గరామేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తాము పాటుపడతామన్నారు. అందులో భాగంగానే ఆలయ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్సవాల సమయంలో భక్తులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ఆలయ కమిటీ కృషి చేయాలని అన్నారు.

కమిటీ చైర్మన్‌గా వెంకటయ్య

శ్రీ బుగ్గరామేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా చేవెళ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్‌గా మాధవరెడ్డి, సభ్యులు సత్యానారాయణ, రాణి, సునీత, శ్రవన్‌కుమార్‌లతో ఎండెమెంట్ అధికారి మోహన్‌రెడ్డి, ఈవో శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ పి.సురేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు గౌరీసతీష్, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.జంగయ్య, ఇతర నాయకులు భార్గవరాం, రాంరెడ్డి, టి.రవీందర్, డి.వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, పెంటారెడ్డి, మాణయ్య, బి.యాదయ్య, సుభాష్‌చంద్రబోస్, చెన్నయ్య, నర్సింహులు, స్వరూప, సురేందర్, అశోక్, రాజు, అస్మత్‌పాషా, అశ్వక్‌అలీ, లింగం, మాసయ్య, యాదగిరి, రవీందర్‌రెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

'ఈవీ గో కార్ట్ చాలెంజ్'లో రన్నర్స్‌గా గురునానక్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ తదితరులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఇటీవల జరిగిన 12వ జాతీయ స్థాయి ఈవీ గోకార్ట్ డిజైన్ చాలెంజ్ ఎలక్ట్రిక్ వెహికిల్ విభాగంలో ఇబ్రహీంపట్నం గురునానక్ విద్యా సంస్థల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. కోయంబత్తూర్‌లోని కార్ మోటార్ స్పీడ్ వేలో ఐఎస్ఈ మోటార్ స్పోర్ట్స్ నిర్వహించిన ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా 80 ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. కుమార గురు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ టీమ్ విజేతగా నిలిచింది. శనివారం ఇబ్రహీంపట్నంలోని గురునానక్ క్యాంపస్‌లో విద్యా సంస్థల వైస్‌చైర్మన్, వీసీ జీఎస్ కోహ్లి, ఎండీ డా.హెచ్.ఎస్.సైనీ, డైరెక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, ప్రిన్సిపాల్ కె.వెంకట్రావ్, ఎస్.శ్రీనాథరెడ్డి, పార్థసారథి తదితరులు విజేతలను అభినందించారు.

ఈవీ గో కార్ట్ సాంకేతిక లక్షణాలివీ..

ఈవీ గో కార్ట్ హై పెర్ఫామెన్స్ మోటార్ కంట్రోలర్స్‌ను కలిగి ఉంది. ఇది 4.8కిలో మీటర్ల డిశ్చార్జ్ శక్తిని అందిస్తుంది. ఇది 64వి, 75ఏహెచ్ సామర్థ్యంతో లిథియం, అయాన్ బ్యాటరీ ప్యాక్(బీఎంఎస్ మోడల్-జేకే-బి1ఎ 24515పి)తో పని చేస్తుంది. ఈ కాన్ఫిగరేషన్ సరైన సామర్థ్యం, వేగం, చురుకుదనాన్ని నిర్ధారించి డిజైన్ చేసినట్టు ఈవీ గో కార్ట్ గంటకు సుమారు వంద కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని సాధించింది. ఈ వాహనం ప్రతీ చార్జికి 90-100 కిలోమీటర్ల దూరం నడుస్తుంది. 5గంటల్లో పూర్తి రీచార్జి చేయొచ్చు.

పేదోళ్లందరినీ ఇంటివారిని చేయడమే ప్రభుత్వ లక్ష్యం



మోడల్ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలో పేదవాళ్లందరినీ ఇంటి వారిని చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ వద్ద ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన చెనిగేశ్‌పూర్ వాసుల ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడారు. 72 గజాల్లో 400 స్క్వేర్‌ఫీట్లలో ఇంటి నిర్మాణాన్ని రూ.5లక్షలతో పూర్తిచేయొచ్చని పేర్కొన్నారు. నియోజకవర్గానికి 15వేల నుంచి 20 వేల వరకు ఇళ్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, మంజూరైన వారంతా ఇళ్లు రాలేదని అనకుండా శ్రద్ధగా నిర్మించుకోవాలని సూచించారు. 72గజాల స్థలంలో హాల్, కిచెన్, బెడ్ రూం, అటాచ్ బాత్ రూమ్ ఇంటిని నిర్మించుకోవచ్చన్నారు. హౌసింగ్ అధికారులు సూచించిన ట్టే ఇల్లు నిర్మించుకోవాలన్నారు. మొదట రూ.1లక్ష వెచ్చించి బేస్మెంట్ కడితే అధికారులు ఆ లక్షను లబ్ధిదారు ఖాతాలో జమచేస్తారన్నారు. ఇందులో దళారుల ప్రమేయమేమీ ఉండదన్నారు. రెండో దఫా లెంటల్ లెవల్ వరకు నిర్మిస్తే మరో లక్ష, స్లాబ్ వేస్తే రూ.2లక్షలు, నిర్మాణం పూర్తయితే రూ.1లక్ష మొత్తం రూ.5లక్షలు లబ్ధిదారు ఖాతాలో వేస్తామని తెలిపారు. ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా పనులు ప్రారంభించుకోవాలన్నారు. దశల వారీగా అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, పీసీసీ కార్యదర్శి ధారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, చెనిగేశ్‌పూర్ మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, వెంకటేష్, మల్లప్ప, రాజుగౌడ్, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, అనిల్, ఏఎంసీ డైరెక్టర్లు ఉదయభాస్కర్‌రెడ్డి, గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గోవులంటే ప్రాణం



పశువుల షెడ్డును శుభ్రం చేస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడకు చెందిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకుడు బక్కని నర్సింహులుకు చిరుప్రాయం నుంచే పశుపోషణపై మక్కువ. చదువు తర్వాత వివేకానంద ఆర్గనైజేషన్‌లో పనిచేస్తున్న సమయంలో తెలిసిన రైతులకు పాడి పశువులను ఇచ్చారు. రాజకీయాల్లోకి వచ్చి శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత షాద్‌నగర్‌లో నివాసముంటూ ఒక లేగదూడతో తిరిగి పశుపోషణను ప్రారంభించి, పాడి ఆవులను వృద్ధి చేశారు. ప్రస్తుతం రెండు గిరి జాతి, రెండు ఒలిస్టీన్, ఒక దేశవాళీ, రెండు జర్సీ ఆవులతో పాటు నాలుగు లేగదూడలు ఉన్నాయి.

ఇప్పటి వరకు 21 ఆవులు దానం

పశువులకు తన ఇంట్లోలోనే షెడ్డును ఏర్పాటు చేశారు. ఆయనకు గుంట సాగుభూమి లేకున్నా... పశుపోషణ భారంగా భావించ లేదు. పెరిగిన పశువులను రైతులకు దానమిస్తున్నారు. ఇప్పటికి 21 ఆవులను దానంచేశారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.98వేలతో కొన్న ఒంగోలు జాతి దూడను అందజేశారు. భూములున్న రైతులే పశుపోషణను వదులుకుంటున్న ఈ సమయంలో బక్కని నర్సింహులు పశుపోషణను కొనసాగిస్తున్నారు. పశువుల పోషణ పెరిగితేనే సంవృద్ధిగా పాలు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు వస్తాయని, అప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవిస్తారని ఆయన నమ్మకం. సామాజిక బాధ్యతగా అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పాడి పశువులను పోషించాలని నర్సింహులు కోరారు.

నువ్వుల సాగులో సస్యరక్షణ పాటించాలి



నువ్వుల మొలకలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, రైతులు

మాడ్గుల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చిన నువ్వు విత్తనాల సాగుపై రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. నూనె గింజల సాగుకు ప్రోత్సాహంలో భాగంగా జాతీయ నూనె గింజల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేసిన నూతన నువ్వు వంగడాలను నాగిళ్లలో సాగుచేశారు. ప్రస్తుతం మొలక దశలో ఉన్న పంటను శనివారం శాస్త్రవేత్త జవహర్ పరిశీలించారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి లాభాలబాట నడవాలన్నారు. అలాగే ఆధునిక సాగు విధానాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్తయ్య, బండ నర్సింహ, బర్రె శ్రీశైలం, లక్ష్మయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నుల వసూలే లక్ష్యం

● వికారాబాద్ డీపీవో జయసుధ



మాట్లాడుతున్న డీపీవో జయసుధ

బషీరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని వికారాబాద్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు. శనివారం బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి విలేకరులతో మట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 594 పంచాయతీల్లో ట్యాక్సులు, కమర్షియల్, ట్రేడ్ లైసెన్సు పన్ను వసూళ్ల రూ.9.56కోట్లు లక్ష్యం కాగా, 85 శాతం పూర్తయ్యాయని తెలిపారు. పంచాయతీలకు రావాల్సిన రూ.10కోట్ల ఎస్ఎఫ్‌సీ నిధులు అరకొరగా రావడంతో ఇబ్బందులున్నాయన్నారు. ఆ నిధులు కూడా పారిశుధ్య కార్మికుల జీతాలకే సరిపోతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.60కోట్లు రావాల్సి ఉండగా ఏడాదిగా నిలిచిపోయాయన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. నీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందన్నారు. గ్రామాల్లోని 406 పశువుల నీటి తొట్లలో పశువుల దాహర్తి తీర్చేందుకు నీరు నింపాలని పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంతకు ముందు కార్యదర్శులతో ఇంటి పన్నుల వసూళ్లపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ విజయకుమారి, ఎంపీవో జయకర్ పాల్గొన్నారు.

రూ.880 కోట్లు

● డీసీసీబీలో పేరుకున్న బకాయిలు

(ఐదో పేజీ తరువాయి)

రూ.880కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఒక్క యాచారం సొసైటీలో 925మంది రైతుల నుంచి రూ.27కోట్ల బకాయిలున్నాయి. వాటిని ఎలా వసూలు చేయాలని డీసీసీబీ అధికారులు, పాలకవర్గం తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటికే మొండిబకాయిల వసూళ్లకు నోటీసులు జారీ చేశారు. ఒకప్పుడు జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిన యాచారం సొసైటీలో రూ.27కోట్ల బకాయిలుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రుణాల రికవరీపై సొసైటీ అధికారులు, పాలకవర్గ సభ్యులు గ్రామాల బాటపట్టారు. రుణాలను చెల్లిస్తే మళ్లీ కొత్తరుణాలను అందిస్తామని అవగాహన కల్పిస్తున్నారు.

రుణాల రికవరీకి చర్యలు



రాష్ట్రంలోనే డీసీసీబీ బ్యాంక్‌ను ఆదర్శంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. తీసుకున్న రుణాల రికవరీకి చర్యలు తీసుకుంటున్నాం. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణ బకాయిలున్న గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. యాచారం మండలం మాల్‌లో కొత్తగా సొసైటీ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. సొసైటీలకు బకాయిలు చెల్లించి తోటి రైతులకు రుణాలందించేందుకు సహకరించాలని రుణ గ్రహీతలను కోరుతున్నాం.

- కొత్త కురుమ సత్తయ్య, డీసీసీబీ చైర్మన్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ కుసుమ

ఆమనగల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌ల ద్వారా వ్యవసాయ అభివృద్ధికి, పెట్టుబడికి తీసుకుంటున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులోగా చెల్లించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ కుసుమ కోరారు. వ్యవసాయ రంగానికి బ్యాంకులు విరివిగా రుణాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు రైతు వేదికలో శనివారం 'వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సు, బడ్జెట్ ప్రాముఖ్యత'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎల్‌డీఎం కుసుమ, ఏడీఏ శోభారాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ సందేశం, వ్యవసాయ రంగం అభివృద్ధికి రైతులు చేయాల్సిన కృషిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ.. నేల స్వభావాన్ని పంటలు సాగుచేసి దిగుబడులు పెంచుకోవాలన్నారు. ఏడీఏ మాట్లాడుతూ.. ఆధునిక సేద్యం, సేంద్రీయ ఎరువుల వినియోగం లాభదాయకమన్నారు. ఆరుతడి పంటలపై దృష్టిసారించాలన్నారు. పంట రుణాలను సకాలంలో చెల్లించి రాయితీలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు అరుణకుమారి, రేణుక చక్రవర్తిని, శ్రీలత, ఏఈవోలు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు సులభంగా రుణాలిచ్చేందుకు కృషి



మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్

మూడుచింతలపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రైతులకు తక్కువ వడ్డీతో పంట రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లిలోని రైతు వేదికలో కేంద్ర బడ్జెట్ 2025-2026 ప్రకటనల అమలు, వ్యవసాయ వృద్ధి, ఉత్పాదకత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా సవరించిన వడ్డీ రాయితీ కింద రుణ పరిమితిని ప్రభుత్వం రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెరిగిందన్నారు. వ్యవసాయ వృద్ధి, ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కొత్త కేంద్ర బడ్జెట్‌పై చర్చించేందుకు వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సుపై వెబినార్ జరిగిందన్నారు. తక్కువ వడ్డీతో రుణాన్ని సులభంగా పొందేలా చేయడానికి, రైతులకు పూచీకత్తు లేని కేసీసీ రుణాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.1.6లక్షల నుంచి రూ.2లక్షలకు పెంచిందని ఆయన తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న రుణ పరపతిని రైతులు సద్వినియోగం చేసుకొని సాగు చేసుకుంటూ సకాలంలో తిరిగి చెల్లించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పెద్దేముల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ శనివారం పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలోని గదులన్నింటినీ చూసి సమస్యలేమైనా ఉన్నాయా? అని పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నెల 5 నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9నుంచి 12గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8.30గంటలకల్లా పరీక్ష కేంద్రం ఆవరణలో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విద్యార్థులకు సౌకర్యాలు ఉన్నాయా? లేదా? అనే విషయాలను తెలుసుకునేందుకు తహశీల్దార్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ నర్సింహులును అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే రోజు నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి

● బైక్‌పై వెళ్తుండగా ఘటన



మృతిచెందిన మనోజ్‌రెడ్డి

ఆదిభట్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో బీటెక్ స్టూడెంట్ మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్ నగర్ మండలం, బైరమల్‌గూడ గ్రామం, రెడ్డికాలనీ సాగర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన కొంతం మనోజ్‌రెడ్డి(19) అతడి స్నేహితుడు అన్వేష్‌రెడ్డి ఇబ్రహీంపట్నం సమీపంలోని మంగల్‌పల్లిలో గల భారత్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నారు. శనివారం ఉదయం మనోజ్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డిలు బైక్‌పై సాగర్ రింగ్ రోడ్డు నుంచి కాలేజీకి వస్తున్నారు. ఈ క్రమంలో తుర్కయంజాల్‌లోని ఆరోగ్య ఆసుపత్రికి వద్దకు రాగానే బైక్‌ను వెనకాల నుంచి లారీ ఢీకొట్టింది. దాంతో మనోజ్‌రెడ్డి లారీకింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాలైన అన్వేష్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుడు మనోజ్‌రెడ్డి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్
కార్యాలయంలో తనిఖీలు

● అనుమతి లేని లే అవుట్ల రిజిస్ట్రేషన్ల పరిశీలన



సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ బుద్ధజ్యోతి

శంషాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ లోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ బుద్ధజ్యోతి తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎలా కొనసాగుతుందో పరిశీలించారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించిన వివరాలను సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే శంషాబాద్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని అనుమతి లేని లేఅవుట్లలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై కూడా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఉన్నంటుండి తనిఖీలు జరుగుతుండటంతో రిజిస్ట్రేషన్లకు వచ్చిన వారు అవాక్కయ్యారు. కాగా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తనిఖీలు స్థానికంగా చర్చనీయాంశమైంది.

ప్రజలు సామరస్యంగా మెలగాలి

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు నిర్వహించే రంజాన్ ఉపవాస దీక్షలను సామరస్యంగా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం ముస్లిం మతపెద్దలు, బీజేపీ నాయకులతో కలిసి పీస్ సమావేశం నిర్వహించారు. మసీదుల వద్ద, ఇతర ప్రార్థనా స్థలాల వద్ద ఇతరులకు ఇబ్బందులు కలగకుండా మత పెద్దలు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రార్థన స్థలాల వద్ద అనుమానితులు కనబడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్, వివిధ వర్గాల పుర ప్రముఖులు పాల్గొన్నారు.



మేడ్చల్ పీఎస్‌లో పీస్ మీటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

తాండూరులో ఆరోగ్య కేంద్రాలను
పరిశీలించిన కేరళ డాక్టర్లు



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతూ వివరాలు తెలుసుకుంటున్న పీఆర్సీ కేరళ డాక్టర్లు

తాండూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తాండూరులోని ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలపై కేరళ పీఆర్సీ వైద్య బృందం సభ్యుడు డాక్టర్ రాజేష్, డాక్టర్ సురేష్ పరిశీలించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం), ఘనాపూర్ వార్డులోని ఆరోగ్య కేంద్రాన్ని శనివారం పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మదిర్ సీహెచ్‌సీలో వైద్య సేవల పురోగతిపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ రవీంద్‌యాదవ్, పీఆర్సీ వైద్యులు గిరిధర్, బుచ్చిబాబు, రవీంద్ర, మాజీ కౌన్సిలర్ సోమశేఖర్, ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఆలయాల
ట్రస్టు బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు

ఘట్‌కేసర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడలో గల శ్రీ ఆంజనేయ, మల్లిఖార్జునస్వామి ఆలయాలకు ట్రస్టును ఏర్పాటు చేసేందుకు ఎండోమెంట్ శాఖ చర్యలు చేపట్టింది. ట్రస్టు బోర్డు ఏర్పాటుకు దరఖాస్తులను కోరుతూ ఉత్తర్వులను జారీచేసింది. బోర్డు సభ్యులుగా చేరగోరేవారు 20రోజుల్లోగా ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో కోరారు.



శివారెడ్డిగూడలోని ఆంజనేయ, మల్లికార్జున స్వామి ఆలయం

వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

● హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దంపతులు
● పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు


నందిగామ : కల్యాణంలో ఎమ్మెల్యే శంకర్ దంపతులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నందిగామ మండల పరిధిలోని వెంకమ్మగూడ మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మల్లికార్జున భ్రమరాంబ దేవిల కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. పూజారులు వీరేషం, శివుడు, మల్లికార్జున ఆధ్వర్యంలో మల్లికార్జున భ్రమరాంబదేవిల కల్యాణం కమనీయంగా జరిపించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అనురాధ దంపతులు స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. ప్రజలు చుట్టుపక్క గ్రామాలు నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవిందర్ యాదవ్ కళ్యాణంలో పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. జడ్పీవైస్‌మాజీ చైర్మన్ గణేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, మాజీ పీఏసీయస్ చైర్మన్ మామిళ్ళ విఠల్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ సర్పంచులు జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, బుయ్యని రజనిత వీరేందర్, జెట్ట కుమార్, గోవిందు అశోక్, బండి నీలమ్మరాజు, పాండయ్య నాయకులు కావలి కృష్ణ, బుగ్గ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

రంగారెడ్డి అర్బన్ : కేశంపేట మండల పరిధిలోని కాకునూర్ శివారులో వెలిసిన మహాలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి దేవాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. బాలికలు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఊరేగింపు అనంతరం రథాన్ని మహాలింగేశ్వర స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింలుగౌడ్, కార్యవర్గ సభ్యులు మోటె శ్రీను, జట్టూరి లక్ష్మారెడ్డి, చెట్టమోని నర్సింలు, జయమ్మ, మాజీ ఉపసర్పంచ్ తైద పర్వతాలు, కోడూరు రాములు, జట్టూరి నాగి రెడ్డి, యారం శేఖర్ రెడ్డి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

అయ్యసాగర్‌లో..

ఆమనగల్లు : రాంనుంతల గేటు సమీపంలో గల అయ్యసాగర్ శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్ర స్వామి భద్రకాళీ సరస్వతి, శ్రీరామాంజనేయ ఆలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. శనివారం తెల్లవారుజామున రథోత్సవం ఘనంగా నిర్వహించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్వాహకులు భట్టు నర్సిరెడ్డి, రామారెడ్డి, ఎన్‌టీ పంచాక్షరి, మల్లప్ప, కర్ణాకర్ రెడ్డి, యాదగిరి రెడ్డి, వీరయ్య, పంతూనాయక్, శ్రీనునాయక్, ఆనంద్, యాదిలాల్, వైద్యనాథ్, యాదయ్య, తదితరులున్నారు.


కేశంపేట : రథం ముందు నృత్యాలతో అలరిస్తున్న బాలికలు

దేవాలయ అభివృద్ధికి విరాళం

రంగారెడ్డి అర్బన్ : నందిగామ మండల కేంద్రంలోని శివరామాంజనేయ స్వామి ఆలయం నిర్వహణ కోసం శనివారం నందిగామకు చెందిన కేశమోని శ్రీనివాస్‌యాదవ్ రూ.40వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సభ్యులు నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, నర్సింలు, దారలింగం, వెంకటయ్య, ప్రభయ్య, మారుతి పాల్గొన్నారు.

నేటినుంచి చరికొండలో వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : మండలంలోని చరికొండ శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటి(ఆదివారం) నుంచి 7వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల కోసం నిర్వాహకులు ఆలయాన్ని పచ్చటి తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయామానంగా అలంకరించారు. ఈమేరకు ఆలయం వద్ద విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు, ధర్మకర్త, అర్చకుడు చక్రవర్తి శ్రీనివాసాచార్య ఈ సందర్భంగా తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రేమావతిపేట్‌కు చెందిన ప్రహ్లాద్ అతని స్నేహితుడు గగన్‌పహాడ్‌కు చెందిన మొహ్మద్ అలీ బాబాలు శంషాబాద్ మండలంలోని భారత్ గ్యాస్ గోదాంలో పనిచేస్తుంటారు. ఈ నెల 26న ప్రహ్లాద్ శివరాత్రి సందర్భంగా ఉపవాసం విరమించేందుకు శంషాబాద్‌కు వెళ్లి వస్తానని అలీబాబాతో చెప్పి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో అలీబాబాకు ఫోన్‌చేసి ప్రహ్లాద్ మార్గమధ్యలో టీఎస్ 07 బీ 1901 నెంబరు గల కారు ఢీకొట్టిందని తెలిపాడు. కాగా, ప్రహ్లాద్‌కు గాయాలవ్వడంతో స్థానికులు శంషాబాద్‌లోని అర్బన్ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై అలీబాబా ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు


అఖిల

రంగారెడ్డి అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. పెద్దషాపూర్ గ్రామానికి చెందిన కటికెల అఖిల భర్త బొల్లారి రాజేశ్ భార్యాభర్తలు. ఈనెల 27న భర్త రాజేశ్ అమ్మతో అఖిలకు గొడవ జరిగింది. భర్త రాజేశ్ పని నిమిత్తం శంసాబాద్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో అఖిల ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో జూకల్‌కు చెందిన అతడి స్నేహితుడు నవీన్ ఫోన్ చేసి అఖిల కూతురితో కలిసి పెద్దషాపూర్ బస్టాండ్ దగ్గర ఉందని తెలపగా... అక్కడికి చేరుకొని పరిశీలించగా కనిపించలేదు. శనివారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో భర్త రాజేశ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

రంగారెడ్డి అర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫరూఖ్‌నగర్ మండలం భీమారంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే భీమారం గ్రామం ఊరెనికి తండాకు చెందిన జమున(45) మద్యానికి బానిసైందని కుటుంబ సభ్యులు మందలించడంతో శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి వరకూ ఇంటికి రాలేదు. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని రాయకుంట చెరువులో శవమై తేలింది. జమునకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లున్నారు. అయితే, జమున చిన్న కూతురు వివాహం ఈ నెల 6న జరగాల్సి ఉంది. జమున మృతితో తండాలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు షాద్‌నగర్ పోలీసులు తెలిపారు.

చిట్టీల పేరుతో రూ.కోటి కుచ్చుటోపీ

● ప్రభుత్వ టీచర్, అతడి భార్య అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

అమనగల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చిట్టీలు, అధిక వడ్డీల ఆశ చూపి అమాయక ప్రజల వద్ద డబ్బు తీసుకొని మోసం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అతని భార్యను పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అమనగల్లు పట్టణానికి చెందిన పాలాది కిషోర్, అతడి భార్య శ్రీలక్ష్మీలు కొన్నేళ్ళుగా అమనగల్లులో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా అధిక వడ్డీ పేరుతో చాలామంది దగ్గర డబ్బులను తీసుకున్నారు. చిట్టీలు పూర్తయిన తర్వాత వారికి డబ్బులు ఇవ్వకుండా అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి వారి వద్దనే డబ్బులను ఉంచుకునేవారు. ఇదిలా ఉండగా, ఇటీవల కొందరు తమ డబ్బులు కావాలని వారిని అడగగా డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. అడిగి, అడిగి విసిగివేసారిన కొందరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ప్రభుత్వ టీచర్ పాలాది కిషోర్, అతడి భార్య శ్రీలక్ష్మీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈమేరకు వారు రూ.కోటికి పైగా మోసం చేసినట్లు అంగీకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు భార్యభర్తలు కిషోర్ శ్రీలక్ష్మీలపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, వారి వద్ద చిట్టీలువేసి మోసపోయినవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమ అమరులను మరువలేము

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ


తలకొండపల్లి : నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఉద్యమ పోరులో ప్రాణాలను అర్పించిన వారిని ఎప్పటికీ మరువలేమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహ మాదిగ తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు శనివారం షాద్‌నగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. సుదర్శన్‌మాదిగ, నాగభూషణ్ మాదిగ, పాండుమాదిగ, తదితరులున్నారు.

ఆమనగల్లు : ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమర వీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఘన నివాళి అర్పించారు. ఆమనగల్లు పట్టణంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కావలి శ్రీశైలం మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకుడు మల్లేపోగు మల్లేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


షాద్‌నగర్ అర్బన్ : నివాళులర్పిస్తున్న నాయకులు

తలకొండపల్లి : మండల కేంద్రంలో మాదిగ అమరువీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో అమరులైన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.

యాచారం : దళిత వర్గీకరణ పోరాటంలో అమరులైన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పోరాటం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు మూలిమహేష్, చింతుల్ల సాయిలు అన్నారు. మండల కేంద్రంలో అమరులైన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అదేవిధంగా చౌదరిపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు జోగు కృష్ణ, ప్రవీణ్, బాలకృష్ణ, గణేష్, యాదగిరి, జోగు అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి అర్బన్ : ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన ఉద్యమంలో పాల్గొని అమరులైన వారి త్యాగాలు మరవలేనిదని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, ఎంఎస్సీ మండల శాఖ అధ్యక్షులు జి.జంగయ్యలు అన్నారు. ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాగల బాబు ఆదేశాను సారం మండల కేంద్రంలో నేతలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరులకు నివాళులర్పించారు. చిర్ర సాయిలు, కె.జంగయ్య, తదిరతులున్నారు.

రంగారెడ్డి అర్బన్ : అమరుల త్యాగం మరువలేనిదని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిర్ర శీను అన్నారు. మండల కేంద్రంలో అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుట్టోనిగూడెం కిష్టయ్య, గ్యార సురేష్, రామచంద్రయ్య, సిలివేరు మల్లయ్య, రమేష్, నాగేష్, మల్లేష్, యాదయ్య, బిక్షపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేడుకలకు మసీదుల ముస్తాబు



రంజాన్ ఉపవాస దీక్షలకు వేడుకలకు అమనగల్లు పట్టణంలో మసీదులు ముస్తాబయ్యాయి. నెలరోజులపాటు కొనసాగే వేడుకల నేపథ్యంలో ఆయా మసీదులలో ఏర్పాట్లు చేశారు. అమనగల్లు పట్టణంలో మూడు మసీదులను శనివారం సాయంత్రం రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. జాగరణకు, ప్రత్యేక ప్రార్థనలకు, ఇఫ్తార్ విందులకు మజీదు కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

- ఆమనగల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి)

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

● అర్హులందరికీ పథకాలు.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందిస్తూ వస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం, సిలిండర్‌పై సబ్సిడీ, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్, కల్యాణ లక్ష్మి, రుణమాఫీ, రైతు బరోస, మహిళలకు వడ్డీలేని రుణాలు, వ్యవసాయ సబ్సిడీలు లాంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గడిచిన ఏడాదిలో ప్రతీ ఊరికి అభివృద్ధి, ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించామని తెలిపారు. అయితే ప్రచారంలో కాస్తా వెనుకబడి ఉండడంతో ప్రతి పక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. షాద్‌నగర్ నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.506 కోట్లు మంజూరు చేయించానని, రూ.206 కోట్ల పనుల కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ఇంటింటా ప్రచారం చేయబోతున్నట్టు తెలిపారు. ఇందు కోసం కాంగ్రెస్ ముఖ్యనాయకులతో సమావేశాన్ని నిర్వహించానన్నారు. చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రతిపక్షాల నోర్లు మూయించడానికి కార్యకర్తలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు జి. బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత


కొత్తూర్ తండాలోని హనుమాన్ ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై శ్రీనివాస్

రంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యతని ఎస్సై జి.శ్రీనివాస్ అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలోని కొత్తూర్‌తండాలో గల పంచముఖి అంజనేయస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రవినాయక్ సొంత ఖర్చులతో ముందుకువచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఎస్సై శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బి. దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించి రవినాయక్‌ను అభినందించారు. కౌన్సిలర్ సోమ్లానాయక్, నాయకులు జంగగళ్ల కృష్ణయ్య, బండి కృష్ణ, సిటీకేబుల్ వెంకటేష్, రాజశేఖర్, శ్రీను, గోపాల్, దేవుల, రెడ్యా, శంకర్, బాలు, రూప్‌సింగ్, సురేందర్, రామదాసు, తాన్య పాల్గొన్నారు.

భగీరథా.. ఏమిటీ వ్యథ!

(5వ పేజీ తరువాయి)

పైప్‌లైన్‌ను గ్రామానికి నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు నేరుగా కలిపారు. దీంతో గ్రామంలో దిగువన ఉన్న కాలానికి తాగునీరు అందుతుండగా, ఎత్తులో ఉన్న బీసీ కాలానికి నీరు అందడంలేదు. 6 నెలలుగా సమస్య ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో ఉన్న నల్లాలు దిష్టిబొమ్మలుగా మారి, సింగిల్ ఫేజ్ మోటార్ల వద్ద నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అలాగే బైర్కాన్‌పల్లి గ్రామంలో కనీసం అవగహన లేకుండా దేవాలయం దగ్గరలో 30వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును నిర్మించారు. సాంకేతిక కారణాలతో ట్యాంకులోకి నీరు ఎక్కడం లేదు. సమస్యను పరిష్కరించాల్సిన ఇంజినీర్లు తమకు పట్టనట్లు వ్యవహరిస్తుండంతో వాటర్‌ట్యాంకు గ్రామానికి దిష్ట బొమ్మలా మారింది. ట్యాంకులోకి నీరు చేరితే దాదాపు 150 కుటుంబాలకు సరఫరా అయ్యే అవకాశముంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. వచ్చే నెలలో ఎండలు పెరిగే ఆవకాశం ఉన్నందున నీటి కష్టాలు తప్పవని ఆయా గ్రామల మహిళలు ఆందోళన చెందుతున్నారు.

ఆరు నెలలుగా నీళ్లు రావడం లేదు



గ్రామంలో ఆరు నెలల నుంచి నల్లా నీళ్లు రావడం లేదు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. సింగిల్ ఫేస్ మోటార్ దగ్గర నుంచి నీళ్ల తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. ఎండకాలం రాకముందే ఇలా ఉంటే కష్టం.

- సుభద్రమ్మ, గృహిణి, సంగెం గ్రామం

దిష్టిబొమ్మలా వాటర్ ట్యాంకు



గ్రామంలో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు దిష్టిబొమ్మగా మారింది. అది కట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు నీరు ఎక్కించలేదు. అధికారులేమో సాంకేతిక సమస్య ఉందంటున్నారు. అలాంటప్పుడు అక్కడ వాటర్ ట్యాంకు ఎందుకు నిర్మించారు.

- యాదగిరి చారి, బైర్కాన్‌పల్లి గ్రామం

నేరుగా పంపింగ్ చేస్తున్నాం

సంగెంలో వాటర్ ట్యాంకు స్లాబ్ కూలిపోవడంతో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్‌ను గ్రామంలోని వాటర్ సప్లయ్ పైప్‌లైన్‌కు నేరుగా కలిపాం. దీంతో సమస్య వచ్చి ఉంటుంది. గేట్‌వాల్వ్ పెట్టి కాలనీలవారీగా నీటిని అందిస్తున్నాం. బీసీ కాలనీలో నీటి సమస్యను పరిష్కరిస్తాం. బైర్కాన్‌పల్లి వాటర్‌ట్యాంకును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తగిన ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతాం. ప్రజలు ఆందోళన చెందవద్దు.

- నాగమణి, మిషన్ భగీరథ ఏఈ, కేశంపేట

రవాణా శాఖకు భారీ ఆదాయం తెచ్చిన ఫ్యాన్సీ నంబర్ల వేలం

● రూ.9.37 లక్షలు పలికిన టీజీ 07పి 9999 నెంబర్

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్సీ నెంబర్ల వేలం ద్వారా రవాణాశాఖకు ఒక్క రోజులో భారీగా ఆదాయం సమకూరింది. రంగారెడ్డి జిల్లా మణికొండలోని రవాణా శాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఫ్యాన్సీ నెంబర్ల వేలం పాట ద్వారా ఒక్కరోజులో రూ. 37 లక్షల ఆదాయం సమకూరింది. ఫాన్సీ నెంబర్ల వేలంపాటలో టీజీ 07 పీ9999 నెంబర్‌కు అత్యధికంగా రూ.9.37 లక్షలు, టీజీ 07 పీ 0009 నెంబర్‌కు రూ.7.50 లక్షలు ధర పలికింది. ఇలా పలు ఫ్యాన్సీ నెంబర్ల వేలం ద్వారా రవాణా శాఖకు శనివారం ఒక్కరోజే భారీ ఆదాయం సమకూరింది.

విద్యార్థులకు కంటి పరీక్షలు

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు విజయవంతంగా కంటి వైద్య పరీక్షలను నిర్వహించామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మీ తెలిపారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 11 రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి వైద్య పరీక్షలు శనివారం ముగిశాయి. డీడీఎంహెచ్‌వో మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లో చదువుతూ, కంటి సమస్యలున్న విద్యార్థులందరినీ తీసుకువచ్చి కంటి వైద్య పరీక్షలను విజయవంతంగా నిర్వహించడానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యులు సౌజన్య, పద్మలత, పుష్పలత, విజయలక్ష్మి, బర్కతుల్లా, ప్రియంక, సానా, శ్రీకాంత్, రాగిణి, కార్తీక్, తదితరులున్నారు.

రాజేందర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషిచేద్దాం


చేవెళ్లలో రాజేందర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

చేవెళ్ల/షాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : దివంగత రాజేందర్ రెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం దివంగత నేత రాజేందర్‌రెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద మహేందర్‌రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, టీఆర్‌ఎస్ యువజన జిల్లా నాయకులు అవినాష్‌రెడ్డిలు కలిసి ఘనంగా నివాళులర్పించారు. చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, యాదగిరి, అగిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు. అలాగే గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పీఆర్‌ఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేసి, జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామని మహేందర్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ కళాశాలలో, మండల పరిధిలోని ముద్దెంగూడ, గొల్లూర్‌గూడల్లో రాజేందర్ రెడ్డి విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డిలతో కలిసి నివాళులర్పించారు. పీఆర్‌ఆర్ స్టేడియాన్ని రూ.50 లక్షలతో అభివృద్ధి చేస్తామన్నారు. రాజేందర్‌రెడ్డి స్మారకార్థం నియోజకవర్గ స్థాయి క్రికెట్, వాలీబాల్ పోటీలను పీఆర్‌ఆర్ స్టేడియంలో నిర్వహించారు. ఈమేరకు గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు.

బీఆర్‌ఎస్ సీనియర్ నేత రాములు మృతి

● సంతాపం తెలిపిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



రంగారెడ్డి అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధి ఎలిమినేడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ బుట్టి రాములు శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాములు భార్య యాదమ్మ ఎలిమినేడు సర్పంచ్‌గా పని చేశారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, నాయకులు వెంకటప్రతాప్‌రెడ్డి, కృపేష్‌తోపాటు పలు పార్టీల నాయకులు ఆయన భౌతిక కాయనికి నివాళ్లర్పించారు.

సంక్షిప్తంగా..

చేవెళ్ల : ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల యాజమన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలను తనిఖీ చేశారు. అనుమతి లేకుండానే శ్రీచైతన్య పాఠశాల యజమాన్యం 9వ, 10వ తరగతులను నిర్వహిస్తుందన్నారు. ఇది వరకు చేవెళ్ల ఎంఈవో పురందాస్ పాఠశాలను తనిఖీ చేసి సీజ్ చేసినా యాజమాన్యం మళ్లీ తరగతులు నిర్వహిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి శ్రీచైతన్య పాఠశాల యాజమన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆమనగల్లు : కల్లు కల్తీచేసి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ అన్నారు. గీత కార్మికులు, కల్లు విక్రయదారులు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై శనివారం కల్లు సరఫరా చేసే వాహనాలను సీఐ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. శెట్టిపల్లి, చరికొండ, ముద్విన్, మద్రిపల్లి, నాగిళ్ల గ్రామాల నుంచి వాహనాల్లో హైదరాబాద్ చుట్టుపక్కల కల్లు దుకాణాలకు తరలిస్తున్న లారీలను నిలిపి కల్లును పరీక్షించారు. ఎలాంటి కల్తీ లేదని గుర్తించినట్లు సీఐ తెలిపారు. కొన్ని లారీలలోని డ్రమ్ముల్లో కల్లు శాంపిల్స్ తీసి హైదరాబాద్ కెమికల్ ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు.

రంగారెడ్డి అర్బన్/శంకర్‌పల్లి : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లో నిర్వహించగా నేతలు కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం నేత కాకి దశరథలతో కలిసి తరలివెళ్లారు. కార్తీక్‌రెడ్డిని గజమాలలతో ఘనంగా సత్కరించారు. శంకర్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం కార్తీక్‌రెడ్డిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రంగారెడ్డి అర్బన్ : ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని రాంచంద్రపూర్ చౌరస్తాలో మహాదేవ్‌పూర్ గ్రామానికి చెందిన కీర్తిశేషులు మధుసూధన్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కుమారుడు రవీందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ కొందుర్గు మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు హఫీజ్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, రాజారమేశ్వర్‌రెడ్డి, రాంచందర్, సత్యప్రమోద్, చంద్రశేఖర్, రాములు గణేష్, విజేందర్‌రెడ్డి, రాము, రాంచంద్రయ్య తదితరుల్లున్నారు.

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలో మాడ్గుల రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆమనగల్లు -షాద్‌నగర్ విస్తరణకు 2021లో సీఆర్‌ఎఫ్ కింద రూ.37 కోట్లు మంజూరు అయ్యాయి. తలకొండపల్లి నుంచి ఆమనగల్లు సురసముద్రం చెరువు కట్ట వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. రాజీవ్‌చౌక్ నుంచి మాడ్గుల రోడ్డు సందబావి వరకు 2022లో రోడ్డు వెడల్పుకు మార్కింగ్ చేశారు. రోడ్డుపక్కన చిరువ్యాపారుల దుకాణాలను తొలగించారు. స్థానికులు సహకరించకపోవడంతో మూడేళ్లైన పనులు చేపట్టలేదు. ఇటీవల ఎమ్మెల్యే నారాయణ రెడ్డి చొరవతో ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ శాఖల అధికారులు, రోడ్డు వెడల్పు చేసే మార్గాన ఉన్న నివాసస్థులతో సమావేశమయ్యారు. 60 ఫీట్లకు బదులుగా 50 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేస్తే తాము అంత స్వచ్ఛందంగా సహకరిస్తామని స్థానికులు తెలిపారు. 50 ఫీట్ల రోడ్డువిస్తరణకు నిర్ణయించగా పనులు ప్రారంభించారు.

చేవెళ్ల : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దామరిగిద్ద మాజీ సర్పంచ్ మలిపెద్ది వెంకటేశంగుప్తా తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరిగిద్దలో రూ.10 లక్షల ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు పనులు గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.

తలకొండపల్లి : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని సీపీఎం కార్యదర్శి శివగల్ల రమేశ్ కోరారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేపట్టి రైతు భరోసా పెట్టుబడి సాయం వెంటనే రైతుల ఖాతాలలో జమచేయాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండలం పడకల్‌లో శనివారం సీపీఎం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీ కార్యదర్శిగా రమేశ్ ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. రాములు, మహేశ్, ప్రవీణ్, మహేశ్,తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ గోవర్దన్‌రెడ్డి బీఆర్‌ఎస్ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గోవర్దన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు.

సృజనాత్మకత వెలికితీతకు వైజ్ఞానిక మేళాలు దోహదం

ఆమనగల్లు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి వైజ్ఞానిక మేళాలు దోహద పడుతాయని టాస్క్ సీవీవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని అరబిందో ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ సుధీర్‌రెడ్డి, సంఘ సేవకుడు పాపిశెట్టిరాము, ట్రస్మా రాష్ట్ర నాయకుడు చుక్కా అల్లాజీ గౌడ్‌లతో కలిసి ఎంఈవో పాండు మేళాను ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులచే రూపొందించిన ప్రదర్శనలు అందరిని అమితంగా ఆకట్టుకున్నాయి. తాము తయారు చేసిన వస్తువులగూర్చి విద్యార్థులు వివరించారు.